క్లుప్తంగా

వివిధ రూపాల్లో అమ్మవార్ల దర్శనం



బావిశెట్టివారిపేట కనకదర్గమ్మ

ఏలూరు (ఆర్ఆర్‌పేట): నగరంలోని వివిధ అమ్మవార్ల ఆలయాల్లో శరన్నవరాత్రి మహోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. ఆయా ఆలయాల్లో అమ్మవార్లకు మంగళవారం విశేష పూజలు చేసి కుంకుమ పూజలు నిర్వహించారు. అనంతరం లలితా సహస్ర నామ పారాయణం చేశారు. ఈ సందర్భంగా అమ్మవార్లకు స్థానిక పవర్‌పేట శ్రీదేవి భూదేవి సమేత వాసుదేవస్వామి ఆలయంలో రాజ్యలక్ష్మి అమ్మవారికి మహాలక్ష్మి అలంకరణ చేశారు. స్థానిక పత్తేబాద కనకదుర్గ అమ్మవారికి మహాచండీ దేవి అలంకరణ చేశారు.

భక్తిశ్రద్ధలతో సువాసిని పూజలు



సువాసిని పూజల్లో పాల్గొన్న మహిళలు

ఏలూరు (టూటౌన్): స్థానిక కొత్తపేట కళ్యాణ వెంకటేశ్వర స్వామి ఆలయ ప్రాంగణంలో దసరా మహోత్సవాల్లో భాగంగా ఆలయ మహిళా కమిటీ నిర్వాహకురాలు వెన్నెల కోట శ్రీనివాస్ హేమ లత ఆధ్వర్యంలో మంగళవారం సువాసిని పూజ భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పేరంటాళ్లు, ముత్తయిదువులను అమ్మవారి శక్తి స్వరూపుణులుగా భావించి కాళ్లు కడిగి పసుపు రాసి కుంకుమతో పారాణి పెట్టి పువ్వులు, గంధం, అక్షింతలతో వేదమంత్రాలతో సుమంగళి పూజ చేశారు. అర్చకుడు ప్రకాషాచార్యులు భక్తులతో అష్టోత్తర శతనామ ప్రత్యేక పూజ చేయించారు. తీర్థ ప్రసాదాల వితరణ చేశారు. మహిళా భక్త బృందాన్ని, వారికి సహకరిస్తున్న గొంతిన రామకృష్ణ, ఝాన్సీలక్ష్మి, జొన్నలగడ్డ వెంకట ఆనంద్ సుజాతలను కళ్యాణ వెంకటేశ్వర స్వామి జానకి రామాంజనేయ గౌరీ శంకర సాయి మందిరం అభివృద్ధి కమిటీ సభ్యులు పూల బొకేలతో, దుస్సాలువాలతో సత్కరించి అభినందనలు తెలిపారు.

నేడు కౌన్సిల్ సర్వసభ్య ప్రత్యేక సమావేశం

ఏలూరు (టూటౌన్): ఏలూరు నగరపాలక సంస్థ కౌన్సిల్ సర్వసభ్య ప్రత్యేక సమావేశం బుధవారం ఉదయం 10.30 గంటలకు నిర్వహించనున్నట్టు అదనపు కమిషనర్, కౌన్సిల్ కార్యదర్శి చంద్రయ్య తెలిపారు. నగర పాలక సంస్థ పరిధిలో ఇటీవల ఇద్దరు పురుషులు, ఒకరు మహిళా కోఆప్షన్ సభ్యులు రాజీనామా చేశారని, దీంతో గత నెల 17వ తేదీ నుంచి 24 వరకు నామినేషన్లు స్వీకరించారని పేర్కొన్నారు. కొల్లేపల్లి రాజు (35వ డివిజన్), చోడే వెంకటరత్నం (11వ డివిజన్), జాలా సుమతి (3వ డివిజన్) నామినేషన్లు దాఖలు చేశారని, వీరి పేర్లను కౌన్సిల్ ముందు ఆమోదం పొందేందుకు ఉంచినట్టు పేర్కొన్నారు.

ఇద్దరు వ్యక్తులపై కేసు నమోదు

ఏలూరు టౌన్: మద్యం మత్తులో ఇద్దరు వ్యక్తులు ఆకతాయితనంగా ఏలూరు నగరంలో తిరుగుతూ చివరకు ఆంధ్రా ఆసుపత్రి వద్దకు వెళ్లి సెక్యూరిటీ గార్డుపై దాడి చేసి అక్కడ ఫర్నీచర్ ధ్వంసం చేశారు. టూటౌన్ పోలీసులకు అందిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు. ఏలూరు వీవీ నగర్‌కు చెందిన దర్శనపు ప్రశాంతి, ఏపూరి నానీలు అర్ధరాత్రి వేళ పూటుగా తాగి ఆర్ఆర్‌పేటలో ఉన్న ఆంధ్రా ఆసుపత్రి రోడ్డుకు వెళ్లి అక్కడ అత్యవసర విభాగపు సెక్యూర్టీ గార్డుతో గొడవ పెట్టుకున్నారు. అక్కడ వారికి సంబంధించి పేషెంట్లు ఎవ్వరూ లేనప్పటికీ మద్యం మత్తులో గొడవ పెట్టుకుని పూలకుండీలు, ఫర్నీచర్ ధ్వంసం చేశారు. అడ్డు వెళ్లిన సెక్యూర్టీ గార్డును కొట్టడంతో ఆసుపత్రి సూపర్‌వైజర్ వల్లూరు గంగరాజు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఏలూరు టూటౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు. పూటుగా మద్యం తాగి దాడి చేసినట్లుగా గుర్తించారు. కేసు దర్యాప్తు చేపట్టారు.

వరదలు వస్తే దిక్కుతోచని స్థితి

- కోమటిలంక వాసుల ఆవేదన
- అనేక ఏళ్లుగా నెరవేరని వంతెన నిర్మాణం
- వైఎస్సార్ సీపీ హయాంలో రూ.10 లక్షలతో గ్రావెల్ రోడ్డు నిర్మాణం



వరద సమయంలో నీట మునిగిన రోడ్డు (ఫైల్)



వైఎస్సార్ సీపీ హయాంలో అభివృద్ధి చేసిన ప్రధాన రోడ్డు (ఫైల్)

ఏలూరు రూరల్: ఇటీవల వచ్చిన వరదలకు సైతం ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని పిల్లా పాపలతో బిక్కుబిక్కుమంటూ జీవించారు ఏలూరు రూరల్ మండలం కోమటిలంక గ్రామస్తులు. వరదలు చుట్టుముట్టిన ప్రతిసారీ గ్రామంలో ఉన్న 1200 మంది ప్రజలు ఏటూ వెళ్లలేక నరకం అనుభవిస్తున్నారు. కోమటిలంక వాసులకు ఏ అవసరానికైనా కైకులూరుకు వెళ్లాలి. కోమటిలంక నుంచి కైకలూరుకు 3 కిలో మీటర్ల దూరం ఉంది. ఈమార్గం మధ్యంలో 100 అడుగుల పొడువు ఉన్న ప్రాంతం లోతట్టు కావడంతో వంతెన నిర్మించాల్సి ఉంది. ఇక్కడ వంతెన నిర్మిస్తే ప్రజలకు అన్నిరకాలుగా మేలు జరుగుతుంది. కోమటిలంకకు కొల్లేరులో వంతెన నిర్మించాలని ఎన్నో ఏళ్లుగా గ్రామస్తులు కోరుతున్నారు.

ప్రమాదకరంగా ప్రయాణం

ఏటా వచ్చే వరదలకు గ్రామ ప్రజలు ప్రమాదం అంచున ప్రయాణించాల్సి వస్తుంది. ఇటీవల వచ్చిన వరదలు సైతం గ్రామాన్ని చుట్టుముట్టాయి. ప్రధాన రోడ్డు నీట మునిగింది. సుమారు 15 అడుగుల ఎత్తు నుంచి వరద నీరు ఉధృతంగా ప్రవహించింది. గత్యంతరం లేని పరిస్థితుల్లో ప్రజలు నాటు పడవల్లో భయంభయంగా ప్రయాణించారు. పిల్లలు, మహిళలు, వృద్ధులు ఇళ్లలోనే ఉండిపోయారు. ఇలాంటి విపత్కర స్థితిలో పాము కరిచినా, గుండెపోటు వచ్చినా ప్రాణాలపై ఆశలు వదులుకోవాల్సిందే. 2012, 2014 సంవత్సరంలో పురుటి నొప్పులతో బాధపడిన ఇద్దరు గర్భిణులు అర్ధరాత్రి వేళ నాటు పడవల్లో కైకులూరు ఆసుపత్రికి తీసుకెళ్లారు. వరద ఉధృతితో భయంభయంగా ప్రయాణిస్తూ సమయానికి ఆసుపత్రికి చేరుకోలేక నాటు పడవల్లోనే ప్రసవించారు. శిశువులు మరణించడంతో వారికి గర్భశోకమే మిగిలింది. అప్పటి నుంచి అధికారులు ఆరోగ్య కార్యకర్తలను గ్రామంలో ఉండాలని ఆదేశించారు. ఎన్నో ఏళ్లుగా ఇలాంటి ప్రమాదకర పరిస్థితులను ఇక్కడ ప్రజలు చవిచూస్తున్నారు.



నాటు పడవలో పయనిస్తున్న మహిళలు



కోమటిలంక రోడ్డుపై ప్రవహిస్తున్న వరదనీరు



వరదలకు పడవపై వెళుతున్న గ్రామస్తులు (ఫైల్)

వైఎస్సార్ సీపీ హయాంలో ప్రణాళిక

వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో వంతెన నిర్మాణానికి అడుగుల పడ్డాయి. నాటి ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి ప్రత్యేక చొరవచూపి కోమటిలంక వంతెన నిర్మాణంపై రాష్ట్ర అటవీశాఖ అధికారులతో చర్చించారు. కేంద్ర అటవీశాఖ నుంచి అనుమతుల కోసం ప్రయత్నాలు చేశారు. ఇదే సమయంలో ఎన్నికలు వచ్చి అనుమతులకు ఆటంకం ఏర్పడింది. అప్పటికే బురదమయమైన ప్రధాన రోడ్డును రూ.10 లక్షలు ఖర్చు చేసి గ్రావెల్ రోడ్డుగా అభివృద్ధి చేశారు.

మా కల నెరవేరాలి



మా గ్రామానికి వంతెన నిర్మించాలి. ఏళ్ల తరబడి మేం అనుభవిస్తున్న నరకానికి చెక్ పడాలి. ఇందుకోసం ఎన్నోసార్లు పాలకులు, అధికారులను వేడుకుంటున్నాం. అటవీశాఖ అధికారులు సైతం సహకరించేందుకు సిద్ధంగా అన్నారు. ఇప్పుడు స్థానిక ఎమ్మెల్యే, అధికారులు వంతెన నిర్మాణానికి కృషి చేయాలి.

– తెనాలి యోహాన్, సర్పంచ్

భయంతో జీవిస్తున్నాం



ఏళ్ల తరబడి ప్రమాదం అంచున భయంభయంగా జీవిస్తున్నాం. వర్షాకాలం వచ్చిందంటే మా కష్టాలు రెట్టింపు అవుతాయి. ప్రధానరోడ్డు మునిగిపోతోంది. బడిపిల్లలు, మహిళలు సైతం పడవలపై నిత్యం భయంతో పయనించాలి. కొన్నిసార్లు పడవలు సైతం వరదదాటికి మునిగిపోయాయి. అందుకే మేం ప్రధానంగా వంతెన నిర్మించాలని కోరుతున్నాం.

– మద్దుల రత్నం, గ్రామస్తుడు

కూటమి పాలనతో విసిగిపోయిన ప్రజలు



గారపాటి నాగేశ్వరరావు

ఏలూరు (టూటౌన్): కూటమి ప్రభుత్వం వంద రోజుల పాలన పట్ల ప్రజలు విసుగు చెందారని వైఎస్సార్ సీపీ ఎస్సీ సెల్ జిల్లా కార్యదర్శి గారపాటి నాగేశ్వరరావు ఆరోపించారు. స్థానిక ఎన్ఆర్ పేటలో మంగళవారం సాయంత్రం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇప్పటికే కూటమి ప్రభుత్వం మంచి ప్రభుత్వమా.. ముంచే ప్రభుత్వమా అనే చర్చ జరుగుతోందన్నారు. చంద్రబాబు ఇంకా రాష్ట్రంలో వైఎస్ జగనే ముఖ్యమంత్రి అనే భ్రమలో ఉన్నట్టు ఉన్నారని తెలిపారు. అధికారం చేపట్టి దాదాపు నాలుగు నెలలుకావస్తున్నా ఇంకా వైఎస్ జగన్‌నే తిట్టడం తప్ప ప్రజలకు ఇచ్చిన హామీలు గురించి ఆలోచించడం లేదని విమర్శించారు. నిత్యావసర ధరలు ఆకాశాన్ని అంటుతున్నాయని, సూపర్ సిక్స్ హామీల గురించి ఎప్పుడో మర్చిపోయాడని అన్నారు. మంచి ప్రభుత్వం అంటూ సొంత డబ్బా కొట్టుకుంటున్నారని తెలిపారు. నాయకులు వారి రాజకీయ అవసరాల కోసం పార్టీలు మారుతుంటారని, జనం మాత్రం వైఎస్ జగన్ వెంటే ఉన్నారని వివరించారు. వచ్చే 2029 ఎన్నికల్లో వైఎస్ జగన్ గెలుపును ఎవరూ ఆపలేరన్నారు. కూటమి ప్రభుత్వం వైఫల్యాల నుంచి ప్రజల్ని ప్రక్కదారి పట్టించడానికి తిరుపతి లడ్డూ వ్యవహారం తెరపైకి తీసుకొచ్చిందన్నారు. చంద్రబాబు నూనె ధరలు పెంచి మద్యం ధరలు తగ్గించడం వల్ల హత్యలు, దొంగతనాలు, అత్యాచారాలు పెరిగి రాష్ట్రంలో అసాంఘిక కార్యకలాపాలు పెరిగిపోతాయనే ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం కళ్లు తెరిచి పాలనపై దృష్టిపెట్టి ప్రజలకు మంచి చేయాలని నాగేశ్వరారావు కోరారు.

శ్రీ వైష్ణవి కళాశాల గుర్తింపు రద్దుకు డిమాండ్

కలెక్టరేట్ వద్ద విద్యార్థి, యువజన సంఘాల ధర్నా



కలెక్టరేట్ వద్ద ఆందోళన చేస్తున్న నాయకులు, బంధువులు

ఏలూరు (టూటౌన్) : చేబోయిన అచ్యుత్ అనే విద్యార్థికి సర్టిఫికెట్లు ఇవ్వకుండా మానసికంగా హింసించి ఆత్మహత్య ప్రయత్నానికి ప్రేరేపించిన కరస్పాండెంట్ పి.మురళీమోహన్‌పై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ బంధువులు, విద్యార్థి, యువజన సంఘాల ఆధ్వర్యంలో మంగళవారం ఏలూరు కలెక్టరేట్ వద్ద ఆందోళన చేశారు. అనంతరం డీఆర్ఓకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా విద్యార్థి అన్నయ్య ఎ.ప్రవీణ్, మేనత్త కె.సుహాసిని, పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు కాకినాని, యువజన కాంగ్రెస్ నాయకులు రాయల సతీష్, ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర కోశాధికారి ఎం సాయి కుమార్ మాట్లాడుతూ గత కొంతకాలంగా ఎన్ఆర్‌పేటలో గల ఎస్‌వీఆర్‌కే, శ్రీ వైష్ణవి విద్యాసంస్థల కరస్పాండెంట్ పి.మురళీమోహన్ ఆగడాలు రోజురోజుకూ పెరిగిపోతున్నాయని, అందుకు నిదర్శనమే విద్యార్థి ఆత్మహత్యా ప్రయత్నం అని వివరించారు. అతని పైన పోలీస్ స్టేషన్లో కేసులు కూడా గతంలో నమోదయ్యాయని గుర్తుచేశారు. డిస్టెన్స్ ఎడ్యుకేషన్‌కు సంబంధించి నాగార్జున యూనివర్సిటీ లేదా ఆంధ్ర యూనివర్సిటీ లేదా ఎగ్జామ్స్‌కు సంబంధించి పెద్ద ఎత్తున మాస్ కాపీయింగ్ పాల్పడే సెంటర్‌గా ఈ కళాశాలకు పేరుందని వివరించారు. విద్యార్థిని ఆత్మహత్య ప్రయత్నానికి ప్రేరేపించిన కరస్పాండెంట్ మురళీమోహన్ పైనా ఇప్పటి వరకు కేసు నమోదు చేయకపోవడం పలు అనుమానాలకు తావిస్తోందని చెప్పారు. వెంటనే మురళీమోహన్‌పై క్రిమినల్ కేసు నమోదు చేసి అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. విజయవాడ హాస్పటల్లో విద్యార్థి చావు బతుకుల మధ్య కొట్టుమిట్టాడుతుంటే కనీసం ప్రభుత్వంనుంచి ఎటువంటి స్పందన లేకపోవడం చాలా దారుణమని, విద్యార్థి భవిష్యత్తుకు భరోసా కల్పించే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. ఒకే బిల్డింగ్‌లో ఐదు రకాల విద్యాసంస్థలు, హాస్టల్ నిర్వహిస్తున్నా అధికారులకు కనబడడం లేదా అని ప్రశ్నించారు. విద్యార్థుల కోసం పనిచేస్తున్న విద్యా సంఘ నాయకులపై కేసులు పెట్టడం ఎంతవరకు సమంజసమని వారు ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. పీడీఎస్‌యూ జిల్లా ఉపాధ్యక్షుడు బి.వినోద్, నగర అధ్యక్షుడు ఎం క్రాంతి, ఏఐఎస్ఎఫ్ నాయకులు సాధిక్ పాల్గొన్నారు.

సీఆర్ఆర్ ఇంజినీరింగ్ ప్రిన్సిపాల్ కేవీరావుకు పురస్కారం



కె.వెంకటేశ్వరరావు, బెస్ట్ ప్రిన్సిపాల్ అవార్డు



కె.రాంబాబు, బెస్ట్ ఉపాధ్యాయ అవార్డు



ఎ.శ్రీనివాస రెడ్డి, బెస్ట్ మెంటార్ అవార్డు



తేజోమూర్తి, బెస్ట్ రీసెర్చ్, ఇన్నోవేషన్ అవార్డు

ఏలూరు (టూటౌన్): కౌన్సిల్ ఫర్ స్కిల్ అండ్ కాంపిటెన్సీస్ (సీఎస్‌సీ – ఇండియా) నీతి అయోగ్ ప్రదానం చేసే ఉత్తమ ప్రిన్సిపాల్ అవార్డుకు ఏలూరులోని సీఆర్ఆర్ ఇంజినీరింగ్ కాలేజీ ప్రిన్సిపాల్ కె.వెంకటేశ్వరరావు ఎంపికయ్యారు. ఈనెల 5వ తేదీన జరిగిన అంతర్జాతీయ ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా ఆయనకు ఈ అవార్డును ప్రదానం చేశారు. ఉత్తమ ఉపాధ్యాయుడిగా కె.రాంబాబు, బెస్ట్ మెంటర్ అవార్డుకు ఎ.శ్రీనివాసరెడ్డి, బెస్ట్ రీసెర్చ్ అండ్ ఇన్నోవేషన్ అవార్డుకు పీహెచ్ఎస్ తేజోమూర్తి ఎంపికయ్యారు. ఈ సందర్భంగా సీఎస్‌సీ ఇండియా సీనియర్ కన్సల్టెంట్ వై.రామ్మోహనరావు మాట్లాడుతూ విద్యారంగంలో చేసిన దీర్ఘకాలిక కృషికి గుర్తింపుగా ఈ అవార్డులను ప్రదానం చేశామని తెలిపారు. అవార్డులకు ఎంపికైన వారిని కళాశాల యాజమాన్యం, అధ్యాపకులు, విద్యార్థులు అభినందించారు.

జ్యోత్స్న మృతికి సంతాపం

ఏలూరు (టూటౌన్): ఐఏఎల్ నేషనల్ వర్కింగ్ ప్రెసిడెంట్, బార్ కౌన్సిల్ ఆఫ్ ఏపీ మెంబర్ సుంకర రాజేంద్రప్రసాద్ భార్య జ్యోత్స్న రోడ్డు ప్రమాదంలో మరణించడం పట్ల ఐఏఎల్ ఏలూరు జిల్లా సమితి మంగళవారం ఒక ప్రకటనలో తీవ్ర సంతాపం వ్యక్తం చేసింది. రాజేంద్రప్రసాద్ కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని ప్రకటించింది. గాయపడ్డ రాజేంద్రప్రసాద్, ఇతర న్యాయవాదులు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించింది.

వైద్యసేవలపై ఆరా

పెదపాడు : జాతీయ ఆరోగ్య పథకాల పనితీరును పరిశీలించేందుకు కేంద్ర వైద్య బృందం సోమ, మంగళవారాల్లో పర్యటించారు. బృందం సభ్యులు అమ్రీన్, వసంత్‌లు కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో అమలు అవుతున్న టీబీ, లెప్రసీ, వైరల్ జ్వరాలు, రాబిస్ కంట్రో ల్, 102, 108 సర్వీసెస్, టుబాకో కంట్రోల్, బయో మెడికల్ ఎక్విప్‌మెంట్ మేనేజ్‌మెంట్ ప్రొగ్రామ్, జాతీయ క్వాలిటీ ఎష్యూరెన్స్ స్టాండర్స్, కాయకల్ప, రాష్ట్రీయ, కిశోర్ స్వస్థ్య వంటి కార్యక్రమాలతో పాటు హెల్త్ సెంటర్స్ పనితీరు, ప్రజలకు అందుతున్న సేవలపై ఆరా తీశారు. వాటిని క్షుణ్ణంగా పరిశీలించి వివరాలు నమోదు చేసుకున్నా రు. ఈ నివేదికలను ఉన్నతాధికారులకు పంపి గ్రేడులు నిర్ణయిస్తామని వైద్యులు తెలిపారు.

ప్రజలకు అందుబాటులో ఉండాలి

పెదపాడు : గ్రామ రెవెన్యూ అధికారులు గ్రామాల్లో ప్రజలకు అందుబాటులో ఉంటూ సేవలందించాలని తహసీల్దార్ కె.సునీత అన్నారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో వీఆర్వోలతో ఆమె సమావేశం నిర్వహించారు. ప్రజా సమస్యలు వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. వీఆర్వోల సంఘం నాయకులు ఆర్‌ఏఎస్ఆర్ చంద్రమూర్తి పాల్గొన్నారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



కలెక్టరేట్ వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న సీఐటీయూ శ్రేణులు

ఏలూరు (టూటౌన్): తమిళనాడు రాష్ట్రం కాంచీపురంలోని సామ్‌సంగ్ పరిశ్రమలో కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సీఐటీయూ ఏలూరు జిల్లా కమిటీ ఆధ్వర్యంలో కలెక్టరేట్ వద్ద మంగళవారం నిరసన వ్యక్తం చేశారు. సామ్‌సంగ్ పరిశ్రమలో పనిచేస్తున్న కార్మికులకు కనీస వేతనాలు ఇవ్వాలని, కార్మిక చట్టాలు అమలు చేయాలని, కార్మికులపై వేధింపులు ఆపాలని, చట్ట ప్రకారం యూనియన్‌ను అంగీకరించి చర్చలు నిర్వహించాలంటూ నినదించారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి డీఎన్‌వీడీ ప్రసాద్ మాట్లాడుతూ సామ్‌సంగ్ కార్మికులు నెల రోజులుగా ఆందోళన చేస్తున్నా ప్రభుత్వాలు పట్టించుకోవడంలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ దేశం నుంచి వేల కోట్ల రూపాయల లాభాలు సంపాదిస్తూ, కార్మికులకు కనీస వేతనాలు ఇవ్వకుండా వ్యవహరిస్తుంటే ప్రభుత్వాలు దక్షిణ కొరియాకు చెందిన బహుళ జాతి సంస్థ అయిన సామ్‌సంగ్‌కు వంత పాడడం అన్యాయమని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు వీవీఎన్ ప్రసాద్, బి.జగన్నాథరావు, కె.విజయలక్ష్మి, జె.గోపి,రాఘవ,శేఖర్, సత్యనారాయణ, టీకే రావు తదితరులు పాల్గొన్నారు.

యాజమాన్య పద్ధతులతో ఎండు తెగులు ఉధృతి నివారణ



పూళ్లలో చేనులో ఎండు తెగులు సోకిన వరి దుబ్బులను పరిశీలిస్తున్న శాస్త్రవేత్త ఫణికుమార్, ఏడీఏ శైలజ, ఏఓ ఉషారాణి, రైతులు

భీమడోలు: ఎండు తెగులు ఉధృతి నివారణకు వ్యవసాయ శాఖ సూచించే యాజమాన్య పద్ధతులను పాటించాలని ఏరువాక కేంద్రం సీనియర్ శాస్త్రవేత్త కె.ఫణికుమార్ అన్నారు. గుండుగొలను-2, పూళ్ల-2 రైతు భరోసా కేంద్రాల పరిధిలో ఏఓ ఎస్‌పీవీ ఉషారాణి ఆధ్వర్యంలో మంగళవారం పొలం పిలుస్తుంది కార్యక్రమం నిర్వహించారు. ఏలూరు వ్యవసాయశాఖ కార్యాలయపు ఏడీఏ శైలజ, సీనియర్ శాస్త్రవేత్త కె.ఫణికుమార్‌లతో కూడిన వ్యవసాయాధికారుల బృందం పంట చేలను సందర్శించింది. వాతావరణ పరిస్థితుల్లో నెలకొన్న అసమానతల నేపథ్యంలో ఎక్కువగా ఎండు తెగులు సోకడాన్ని గుర్తించి, తెగులు నివారణకు రైతులకు పలు సూచనలందించారు. నత్రజని ఎరువుల వాడకాన్ని తగ్గించాలని, ఉధృతిని తగ్గించేందుకు కాపర్ హైడ్రాక్సైడ్ 2 గ్రాములను ఒక లీటర్ నీటిలో కలిపి ఎకరం పొలానికి పిచికారీ చేయాలని సూచించారు. అనంతరం రైతు భరోసా కేంద్రాల్లో రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఏఓ ఎస్‌పీవీ ఉషారాణి మాట్లాడుతూ సార్వా సీజన్‌లోని ధాన్యాన్ని నిబంధనల మేరకు కొనుగోలు చేస్తామని, రైతులకు అందుబాటులో ఉండే రైస్ మిల్లులకు ధాన్యాన్ని అమ్మేలా ప్రభుత్వ అధికారులు తగు చర్యలు చేపట్టారని చెప్పారు. వ్యవసాయ అనుబంధ శాఖలకు చెందిన పథకాలు, వాటి వల్ల రైతులకు కలిగే ప్రయోజనాలను వివరించారు. కార్యక్రమంలో వ్యవసాయ శాఖ, మత్స్యశాఖ, వె టర్నరీ, రెవెన్యూ, కోఆపరేటివ్ శాఖల సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

తెగుళ్ల నివారణకు జీవామృతం

పెదపాడు : రైతులు తెగుళ్ల నివారణకు జీవామృతం తయారు చేసుకోవాలని డీఆర్‌సీ ఏడీఏ పి.లలిత సుధ తెలిపారు. పెదపాడు మండలం వసంతవాడ, గోగుంట గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రస్తుతం వాతావరణం దృష్ట్యా వరిలో పురుగులు, తెగుళ్ల నివారణకు చర్యలు చేపట్టాలని వారు సూచించారు. వరిసాగులో పాటించాల్సిన చర్యలను వివరించారు. తెగుళ్ల ఉధృతి ఎక్కువగా ఉందని, తగిన సమయంలో సరైన నివారణ చర్యలు తీసుకోవాలని రైతులకు సూచించారు. కార్యక్రమంలో వ్యవసాయ అధికారి వీ ప్రదీప్‌కుమార్ రైతులు తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ సమాచారం

ఏలూరు ఆర్టీసీ డిపో నుంచి దూరప్రాంతాలకు వెళ్లే బస్సుల సమయాలు, రిజర్వేషన్ వివరాలు

ఏసీ బస్సులు..

బస్సు రూటు	సమయం	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు –బీహెచ్ఈఎల్ (ఇంద్ర)	21.00	22
ఏలూరు –బీహెచ్ఈఎల్ (అమరావతి)	22.00	24
ఏలూరు – బీహెచ్ఈఎల్ (స్టార్ లైనర్ నాన్ఏసీ స్లీపర్)	22.30	14
ఏలూరు – తిరుపతి(ఇంద్ర)	19.00	40

సూపర్ లగ్జరీ

బస్సు రూటు	సమయం	సర్వీస్ నంబర్	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు – బీహెచ్ఈఎల్	21.45	4820	17
ఏలూరు – బీహెచ్ఈఎల్	21.15	4822	25
ఏలూరు – బీహెచ్ఈఎల్ వయా కే.కోట	19.30	4796	25
ఏలూరు –బీహెచ్ఈఎల్ వయా రామచంద్రపురం	19.45	4798	21
ఏలూరు–జీడిమెట్ల వయా ఖమ్మం	20.15	4802	20
ఏలూరు–బీహెచ్ఈఎల్ వయా ఖమ్మం	20.30	4800	26
ఏలూరు – బీహెచ్ఈఎల్ వయా ఖమ్మం	21.00	4804	29
ఏలూరు – ఈసీఐఎల్	22.30	4814	09
ఏలూరు – తిరుపతి	16.00	4830	36

చీరకు నిప్పంటుకుని వృద్ధురాలి మృతి

ఏలూరు టౌన్: దీపారాధన పూజ చేసే సమయంలో ప్రమాదవశాత్తు ఒక వృద్ధురాలి చీరకు దీపం మంట అంటుకుని అగ్ని ప్రమాదం సంభవించింది. తీవ్ర గాయాలకు గురైన ఆమెను ఒక ప్రైవేటు ఆసుపత్రికి చేర్పించగా చికిత్స పొందుతూ మృతి చెందింది. ఏలూరు సమీపంలోని నత్రంపాడు విద్యుత్ నగర్‌లో నివాసం ఉన్న తాడినేని బేబి సరోజని (80) తమ అల్లుడు కుమార్తె వద్ద ఉంటున్నారు. ఈనెల 7వ తేదీ ఉదయం ఇంట్లో దీపారధన చేస్తున్న సమయంలో దీపం మంట చీరకు అంటుకుని అగ్ని ప్రమాదం సంభవించింది. తీవ్ర గాయాల పాలైన ఆమెను ఆంధ్రాఆసుపత్రిలో చేర్పించగా చికిత్స పొందుతూ మృతి చెందింది. ఏలూరు త్రీ టౌన్ పోలీసులు మంగళవారం కేసు నమోదు చేశారు. వృద్ధురాలి మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి, బంధువులకు అప్పగించారు. అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కొత్త బస్టాండ్ లో చోరీ

ఏలూరు టౌన్: ఒక మహిళ తన గ్రామం నుంచి కుమార్తె ఇంటికి వెళ్తుండగా ఏలూరు కొత్త బస్టాండ్లో పర్సు అపహరణకు గురైంది. దీంతో బాధితురాలు ఏలూరు త్రీ టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేశారు. ద్వారకాతిరుమల మండలం దొరసానిపాడు గ్రామానికి చెందిన అల్లాడ లక్ష్మి ఈనెల 7వ తేదీన తన గ్రామం నుంచి లింగపాలెం నుంచి ధర్మాజీగూడెం సమీపంలో మఠంగూడెం గ్రామంలో ఉన్న తన కుమార్తె ఇంటికి వెళ్లడానికి బయలుదేరారు. తన గ్రామం నుంచి ఏలూరు కొత్త బస్టాండ్‌కు బస్సులో వచ్చారు. తిరిగి మఠంగూడెం వెళ్లేందుకు చింతలపూడి బస్సు ఎక్కారు. బస్సు రద్దీగా ఉండడంతో ఎవరో తన హ్యాండ్ బ్యాగ్ లోని చిన్న పర్సును తీసినట్టు గుర్తించి వెంటనే వెతికారు. దీంతో త్రీ టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆపర్సులో రూ.72 వేలు, రెండు గ్రాముల రింగు ఉన్నట్లుగా ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేపట్టారు.

విద్యార్థులకు గాయాలు

ఏలూరు టౌన్: మోటారు సైకిల్ పై వెళ్తున్న ఇద్దరు విద్యార్థులను ప్రైవేటు ట్రావెల్ బస్సు ఢీ కొనడంతో తీవ్ర గాయాలపాలయ్యారు. ఏలూరు రూరల్ మండలం మాదేపల్లి గ్రామానికి చెందిన తరగళ్ల సాయి మహేష్ (16) ఇంటర్మీడియట్ చదువుతున్నాడు. అదే గ్రామానికి చెందిన బండి మనోజా బాలబాలాజీ (16)తో కలిసి మోటారు సైకిల్‌పై మానూరువైపు వెళ్తుండగా మహేశ్వరపురం మలుపు వద్ద ఒక ప్రైవేటు ట్రావెల్ బస్సు మంగళవారం ఉదయం ఢీ కొంది. ఈ ప్రమాదంలో తీవ్ర గాయాలపాలైన వీరిద్దని ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తీసుకొచ్చి వెంటనే ప్రైవేటు ఆసుపత్రికి తీసుకువచ్చారు. ఈ ఘటనపై ఏలూరు రూరల్ పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు.